# ఉభయకుశలోపరి

రైలు గట్టిగా కూత వేసింది.

అంటే బయల్దేరటానికి సిద్ధంగా వుందన్నమాట.

నా ముందు సీట్లో కూర్చున్న దుబ్బు మీసాలు ఎంతోసేపటి నుంచి ఎడతెరిపి లేకుండా వున్న తన వాక్ప్రవాహానికి ఆనకట్టవేసి, ప్రక్కనున్న బట్టతలతో అన్నాడు - 'కాఫీ త్రాగు దామా'అని.

బట్టతల త్రాగుదాం అన్నట్లుగా అటూ, యిటూ ఊగింది.

"కాఫీ - కాఫీ - కాఫీ" అరుస్తూ వెడుతున్నాడు, ఒక పదిహేనేళ్ళ కుర్రాడు ప్లాట్‌ఫారం మీద.

దుబ్బు మీసాలు ఆ అబ్బాయిని కేకేసి, రెండు కాఫీ తీసుకున్నాడు.

కాఫీ అబ్బాయిని చూస్తే ఏమిటో జాలివేసింది - చింపిరి జుట్టుతో, మాసిన బట్టలతో, పేదరికానికి ప్రతినిధిలా వున్నాడు - అలా వుండక యింకెలా ఉంటాడు? - రోజల్లా యిలా రెక్కలు, ముక్కలు చేసుకుని స్టేషన్లో కాఫీలు అమ్మితే - అతని కమీషన్ రెండు మూడు రూపాయలు అయినా వస్తుందో రాదో మరి.

"వెంకయ్యగారు ఈసారి ఎన్నికలలో నుంచుంటారని వినగానే, నేను ఆశ్చర్యపోయాను సుమా!" కాఫీ కొంచెం చప్పరించి అన్నాడు దుబ్బు మీసాలు.

"ఆయన కసలు నుంచోవాలని అనిపించలేదు. సుబ్బయ్యగారు నుంచుంటారని తెలిశాక, ఆయనకు పోటీగా వుండాలని ఈయన నుంచున్నాడు" - బట్టతల కాఫీ త్రాగకుండానే నోరు చప్పరించాడు - ఈ రాజకీయాలు మనకి తెలియనివేమిటి అన్న సదుద్దేశంతో.

అభ్యర్థులు ఎలా ఎన్నికల్లో నుంచుంటున్నారో ఊహించుకుంటూ - వాళ్ళ మాటలు వింటున్నాను.

"అయితే నాగయ్య పార్టీ వాళ్ళు ఈసారి ఎవర్ని సమర్థిస్తారుట?" దుబ్బు మీసాలు అడిగాడు.

రైలు మళ్ళీ కూతవేసింది.

"సార్ - గ్లాసూ, డబ్బులు యివ్వండి సార్!" కాఫీ కుర్రాడు అడుగుతున్నాడు.

"తాగనీవయ్యా - మరీను." కసురుకున్నాడు బట్టతల - కానీ నా వేపే సూటిగా చూస్తున్నాడు.

పమిట సర్దుకుంటూ ఒకసారి బట్టతల వేపు చూశాను. చూపులు తిప్పి ఊదుకుంటూ నెమ్మదిగా కాఫీ త్రాగుతున్నాడు.

కాఫీ అతను తొందరపడుతున్నాడు.

దుబ్బు మీసాలు తన ప్రశ్నకు సమాధానం రాకపోవడంతో మళ్ళీ అడుగుతున్నాడు.

"అయితే నాగయ్య పార్టీ వాళ్ళు ఈసారి ఎవర్ని సమర్థిస్తారుట?"

రైలు బయలుదేరింది. మెల్లగా వెడుతున్నది.

"గ్లాసులు సార్ - అర్వై పైసలు సార్" అరుస్తూ రైలుతో పాటు చకచకా నడుస్తున్నాడు కాఫీ కుర్రాడు.

దుబ్బు మీసాలు అతన్నోమారు విసుగ్గా చూసి, మళ్ళీ కాఫీ త్రాగుతున్నాడు.

రైలు నడవటం మానేసి పరుగెత్తటం ప్రారంభించింది.

"అసలు నాగయ్య పార్టీ వాళ్ళు అంతా విచిత్రమైన వ్యక్తులు -"

బట్టతల అంటున్నాడు. తాపీగా జేబులోంచి చుట్టా, అగ్గిపెట్టె బయటకు తీస్తూ.

రైలుతో పాటే పరుగెడుతున్న కాఫీ కుర్రాడు అరుస్తున్నాడు 'సార్ - గ్లాసులు

డబ్బులు.'

"విచిత్రమైన వ్యక్తులు అంటే నీ ఉద్దేశంలో ఎలాటివారని?" అడిగాడు దుబ్బుమీసాలు కాఫీ త్రాగటం పూర్తిచేసి, గ్లాసు కిటికీ దగ్గర పెడుతూ.

కుర్రాడు గ్లాసు అందుకున్నాడు.

"సార్ రెండు కాఫీ అరవై పైసలు సార్ - డబ్బులు సార్" పరుగెత్తున్నాడేమో రొప్పుతూ అడిగాడు.

"నేను ఒట్టినే అలా అనటంలేదు. దానికి కారణముంది - నాగయ్యకు కులాభిమానం, ధనాభిమానం - రెండూ ఎక్కువే. పోయినసారి ఎన్నికల్లో ఈ నాగయ్య ఏం చేశాడంటే..."

రైలు ఇంకా వేగం అందుకుంది.

కుర్రాడు పరుగెత్తుతూ అరుస్తున్నాడు.

బట్టతల గ్లాసు అందించాడు.

"అరవై పైసలు" కుర్రాడు అరుస్తున్నాడు.

"చిల్లరుందా పది రూపాయలకి?" అడిగాడు దుబ్బుమీసాలు - పది రూపాయల నోటు బయటకు తీయకుండానే.

" లేదు సార్" ఎప్పుడో అదృష్టం బాగున్న రోజున మాత్రమే చూస్తాడు వాడు పది రూపాయల నోటు.

"మరయితే ఎలా ? " బట్టతల అన్నాడు చుట్ట వెలిగిస్తూ.

ట్రెయిన్ ప్లాట్‌ఫారం దాటుతున్నది.

కుర్రాడు రైలుతో పరుగెత్తలేక వెనకబడ్డాడు. అయినా శక్తి కొద్దీ పరుగెడుతున్నాడు. ఆ హడావిడిలో అతను అక్కడున్న స్తంభానికి గుద్దుకుని కిందపడ్డాడు.

గాబరాగా చూశాను. అతను నెమ్మదిగా లేచి, దులుపుకుని వేగంగా పరుగెడుతున్న ట్రెయిన్ వైపు దీనంగా చూస్తున్నాడు. చేతిలో గ్లాసులు కిందపడి పగిలిపోయాయి. అంటే ఈరోజు అతని ఆదాయంలో రెండు రూపాయలు మినహాయించబడతాయన్నమాట.

"పోయినసారి ఎన్నికల్లో నాగయ్య ఏం చేశాడు?" అడుగుతున్నాడు దుబ్బు మీసాలు, తనూ చుట్ట వెలిగిస్తూ.

బట్టతల అటూ, యిటూ అందరివేపు ఒకసారి చూసి అన్నాడు - 'నాగయ్య పార్టీ - డబ్బున్నవాళ్ళనే సపోర్టు చేస్తారెప్పుడూ - పేద ప్రజల కష్టాల గురించి ఆలోచించరసలు.'

"అయితే ఈసారి వాళ్ళేం గెలుస్తారు? మనం వెంకయ్యగారి పార్టీనే సపోర్టు చేద్దాం. పేద ప్రజల సేవ చేసుకునేనా బ్రతుకవచ్చును" - సలహా ఇచ్చాడు దుబ్బు మీసాలు.

"అంతే - అంతే - పదవులు వస్తే వస్తాయి, లేకపోతే లేదు. పేద ప్రజల సేవ చేసేవాళ్ళనే మనం సమర్థించాలి" - బట్టతల సమర్థిస్తూ అటూ, ఇటూ వూగింది. ✿